సాక్షి అనకాపల్లి

సోమవారం । 27 । మే । 2024



ఆయిల్‌పామ్ సిరులు 8లో

మెట్ట భూములు ఆయిల్‌పామ్ తోటలతో కళ కళలాడుతున్నాయి. జిల్లాలో దాదాపు 7,800 ఎకరాల్లో పంట సాగవుతోంది.



అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆది వారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.3/27.2

తేలికపాటి వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశముందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి ఆదివారం తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష



పరీక్షా సమయానికి ఆలస్యంగా రావడంతో బయట నిలిచిపోయిన విద్యార్థి

అక్కిరెడ్డిపాలెం (విశాఖ): జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష షీలానగర్‌లోని అయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రంలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 570 మంది విద్యార్థులకు గాను 569 మంది పరీక్షకు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించారు. నిర్ణీత సమయానికి హాజరుకాకపోవడంతో ఓ విద్యార్థిని పరీక్షా కేంద్రంలోకి నిర్వాహకులు అనుమతించలేదు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి పంపించారు.

3 నుంచి కథక్ నృత్య వర్క్‌షాప్



కథక్ నృత్యకళాకారిణి అనురేఖా గోష్

మద్దిలపాలెం (విశాఖ): అంతర్జాతీయ కథక్ నృత్య కళాకారిణి, కొరియోగ్రాఫర్ అనురేఖా గోష్ చే విశాఖ వేదికగా వచ్చే నెల 3 నుంచి 7వ తేదీ వరకు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకులు బత్తిన విక్రమ్ గౌడ్ తెలిపారు. విశాఖలో నిర్వహించే ఈ వర్క్‌షాప్‌కు హాజరు కావాలనే వారు ముందుగా వారి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు కథక్ నృత్యంలో శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణలో పాల్గొనే ప్రతి ఒక్కరూ చివరి రోజున స్టేజ్ పై ప్రదర్శన ఇస్తారన్నారు. 10 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9848137445 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చోడవరంలో 79 వాహనాల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

చోడవరం రూరల్: పట్టణ శివారు ప్రాంతం ద్వారకానగర్ వద్ద ఆదివారం పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించి భారీగా వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు సూర్యనారాయణ, శేఖరం ఆధ్వర్యంలో జరిపిన సోదాల్లో సరైన పత్రాలు లేని ఒక జీపు, నాలుగు ఆటోలు 74 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పత్రాలు చూపిన వారికి వాహనాలు అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ తగిన రికార్డుల్లేకుండా ఎవరూ వాహనాలను కొనుగోలు చేయరాదని తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట(విశాఖ): ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను, కౌంటింగ్ కేంద్రాలను విశాఖ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదివారం పరిశీలించారు. పోలీసు జాయింట్ కమిషనర్ ఫకీరప్పతో కలిసి పార్లమెంట్, అంసెబ్లీ ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన ఆయన భద్రతాపరమైన చర్యలను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, మానిటరింగ్ రూమ్ ద్వారా పర్యవేక్షణ గురించి అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జూన్ 4వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

భద్రంగా బడి బస్సు..

జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్నాయి. కాస్త దూరంగా ఉన్నా.. మంచి విద్యాసంస్థలో చదివించాలని తల్లిదండ్రులు ఆరాటపడుతుంటారు. ఇంటికి దూరంగా ఉండే పాఠశాలలకు వెళ్లేందుకు బడి బస్సులకు వేలకు వేలు చెల్లిస్తారు. అవి విద్యార్థులను భద్రంగా తీసుకెళ్లి.. క్షేమంగా ఇంటికి చేర్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వాటి సామర్థ్యంపై దృష్టి సారించారు. తనిఖీలు చేసి ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు.



బడిబస్సు ప్రమాణాలను పరిశీలిస్తున్న జిల్లా రవాణా అధికారి ప్రకాష్

- విద్యాసంవత్సరం ప్రారంభం కానుండడంతో ప్రత్యేక దృష్టి
- ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం క్యూకడుతున్న వాహనాలు
- సామర్థ్య పరీక్షలకు ప్రత్యేక స్లాట్‌లు
- జిల్లాలో విద్యా సంస్థల బస్సులు 419
- ఇప్పటి వరకు ఎఫ్‌సీ రెన్యువల్ చేసుకున్నవి 185

తుమ్మపాల: నూతన విద్యా సంవత్సరం (2024-25)లో పాఠశాలలు పునఃప్రారంభానికి సమయం సమీపిస్తుండడంతో బడి బస్సుల భద్రతపై అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. వచ్చేనెల నెల 12 నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి సారించింది. జిల్లాలో ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక శాతం విద్యార్థులు ఆయా యాజమాన్యాలకు చెందిన బస్సులపైనే రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతి బస్సు సామర్థ్యం సరిగ్గా ఉండాలి, బస్సు సామర్థ్యం సరిగ్గా లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశముంది. అందుకే మోటార్ వెహికల్ తనిఖీ అధికారులు బస్సు కండిషన్ చెక్ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) జారీ చేస్తుంటారు. గత ఏడాది జారీ చేసిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కాలపరిమితి ఈ నెల 15వ తేదీతో ముగియడంతో కొత్త సర్టిఫికెట్ల జారీ కోసం బడిబస్సులు ఆర్టీవో కార్యాలయం వద్ద క్యూ కడుతున్నాయి. వీటి సామర్థ్యాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ఇప్పటి వరకు 185 బస్సులకు ఎఫ్‌సీ రెన్యువల్ చేశారు.

ఆన్‌లైన్‌లో ఈ–స్లాట్ తేదీల ఖరారు

అనకాపల్లి, నర్సీపట్నం రవాణా శాఖ కార్యాలయాల అధికారులు జిల్లాలోని స్కూళ్లు, కళాశాలల బస్సుల సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వాహనాలు ఎలా ఉండాలనే విషయమై ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలకు రవాణా శాఖ అధికారులు తెలియజేశారు. వాహన ఫిట్‌నెస్ ధ్రువీకరణ కోసం ముందుగా ఆన్‌లైన్‌లోనే విద్యాసంస్థ యాజమాన్యాలు ఈ–ప్రగతి పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. అనంతరం ఎఫ్‌సీ చేయించుకునేందుకు రవాణాశాఖ కార్యాలయం అధికారులు ఓ తేదీని కేటాయిస్తారు. ఆ ప్రకారం వాహనాన్ని రవాణా శాఖ కార్యాలయానికి తీసుకొస్తే, ఫిట్‌నెస్ తనిఖీలు నిర్వహిస్తారు.



ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం అనకాపల్లి ఆర్టీవో కార్యాలయం వద్ద బడిబస్సులు

మండలాల వారీగా బస్సుల వివరాలు

జిల్లాలో వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులు 419 వరకు ఉన్నాయి. మండలాల వారీగా పరిశీలిస్తే అనకాపల్లి మండలంలో 69, అచ్యుతాపురం 37, బుచ్చెయ్యపేట నాలుగు, చోడవరం 33, దేవరాపల్లి నాలుగు, గొలుగొండ రెండు, కె.కోటపాడు రెండు, కశింకోట 22, కోటవురట్ల ఒకటి, మాకవరపాలెం 28, మునగపాక 10, నక్కపల్లి రెండు, నర్సీపట్నం 47, నాతవరం మూడు, పరవాడ 44, పాయకరావుపేట 34, రాంబిల్లి 11, రావికమతం 12, రోలుగుంట రెండు, ఎస్.రాయవరం 19, సబ్బవరం 25, వి.మాడుగుల మూడు, యలమంచిలి మండలంలో ఐదు బస్సులు ఉన్నాయి. ఈ బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా రోడ్డుపై తిరగడానికి వీల్లేదు. 2017 నుంచి బడిబస్సులకు స్పీడ్ గవర్నర్స్ ఏర్పాటుచేసుకోవడం తప్పనిసరి చేశారు. ఈ బస్సులు గంటకు 60 కిలో మీటర్లలోపు వేగంతో మాత్రమే ప్రయాణించాలి.

ఇవి తప్పనిసరి

- పాఠశాల బస్సును నడిపే డ్రైవర్‌కు బీపీ, సుగర్, కంటి సంబంధిత సమస్యలు లేవని సర్టిఫికెట్ సమర్పించాలి.
- బస్సుకు సంబంధించిన అన్ని లైట్లు పనిచేయాలి. రిఫ్లెక్టివ్ టేపును బస్సుకు నాలుగు వైపులా అతికించాలి. బస్సుకు ఉన్న గ్లాసులన్నీ పటిష్టంగా ఉండేలా చూడాలి.
- బస్సు నుంచి అధిక మొత్తంలో బ్లాక్ స్మోక్ (పొగ) రాకుండా చూసుకోవాలి.
- బ్రేక్ కండిషన్‌లో ఉండాలి. హ్యాండ్ బ్రేక్, స్పీడో మీటర్ సక్రమంగా పనిచేయాలి.
- స్టీరింగ్, టైర్ల కండిషన్ సరిచూసుకోవాలి.
- ప్రతి బస్సులో మందులు, పరికరాలతో కూడిన ప్రథమ చికిత్స బాక్స్ అందుబాటులో ఉంచాలి. వారానికోసారి ప్రిన్సిపాల్, సంబంధిత అధికారి ఈ బాక్స్ తనిఖీ చేయాలి. నెలకోసారి పేరెంట్స్ కమిటీ పరిశీలించడంతో పాటు, దీని కోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలి.
- బస్సులో సీట్ల కింద బ్యాగులు ఉంచుకునేందుకు అరలు ఏర్పాటు చేయాలి. సైడ్ విండోలకు మధ్యలో మూడు అంగుళాలకు మించని దూరంలో అడ్డంగా మూడు లోహపు కడ్డీలు అమర్చాలి. ప్రతి విద్యా సంస్థ యాజమాన్యం, ట్రాన్స్‌పోర్ట్, పోలీస్, విద్యాశాఖల సౌజన్యంతో విద్యార్థులకు ఏడాదికి ఒక రోజు రోడ్ సేఫ్టీ తరగతులు నిర్వహించాలి.
- బస్సు నడిపే డ్రైవర్లు ఐదేళ్ల అనుభవం, 60 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలి.
- బస్సు ఫుట్‌బోర్డుపై మొదటి మెట్టు భూమి నుంచి 325 మిల్లీ మీటర్ల ఎత్తుకు మించరాదు. మెట్లు జారకుండా ఉండే లోహంతో చేయించాలి.
- బస్సులో అత్యవసర ద్వారం, మంటలను ఆర్పే పరికరం ఏర్పాటు చేసుకోవాలి.
- అత్యవసర ద్వారం అని తెలిసేలా స్పష్టంగా కనిపించే విధంగా రాయించాలి.
- బస్సులో ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పట్టుకునేందుకు వీలుగా బస్సు ముందు తలుపు మెట్లకు సమాంతరంగా రెయిలింగ్‌లు ఏర్పాటు చేయాలి. విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు బస్సు అటెండెంట్ పర్యవేక్షించాలి.
- పాఠశాల వద్ద బస్సుల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించాలి. బస్సులో అటెండర్ తప్పకుండా ఉండాలి.
- సీటింగ్ కెపాసిటీకి మించి విద్యార్థులను ఎక్కించకూడదు. బస్సు ఎడమవైపు ముందు భాగంలో యాజమాన్యం వివరాలు, స్కూల్ బాయ్ అండ్ గర్ల్ ఇమేజ్ పొందుపర్చాలి.
- బస్సు బయలుదేరే సమయం, ఆగే స్థలాల రూట్ ప్లాన్ ఉంచాలి. విద్యార్థుల సంఖ్య, వారి పూర్తి వివరాలు, అలాగే డ్రైవర్ వివరాలు బస్సులో ఏర్పాటు చేయాలి.
- ప్రతి నెలా బస్సు కండిషన్ యాజమాన్యాలు, పాఠశాల పేరెంట్స్ కమిటీ తనిఖీ చేయాలి. బస్సులో ఫిర్యాదుల పుస్తకం ఉంచాలి.
- బస్సులో అటెండర్ తప్పకుండా యూనిఫామ్ ధరించాలి.
- వెనుక నుంచి వచ్చే వాహనాలను చూసేందుకు వీలుగా బస్సు డ్రైవర్‌కు కుడి, ఎడమ వైపు బయట, లోపల మిర్రర్లు ఏర్పాటు చేయాలి. బస్సు ఎట్టి పరిస్థితుల్లో రాంగ్ రూట్లో ప్రయాణించరాదు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేస్తాం

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతి స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సీ) తప్పనిసరిగా ఉండాలి. వచ్చేనెల 15వ తేదీ లోపు ఎఫ్‌సీ చేయించుకోవాలి. పాఠశాలలు ప్రారంభానికి ముందే అన్ని అనుమతులు పొందాలి. జిల్లాలో అనకాపల్లి డివిజన్‌లో 65, నర్సీపట్నం డివిజన్‌లో 120 బస్సులు కలిపి మొత్తం 185 బస్సులను గడిచిన ఐదు రోజుల్లో తనిఖీలు చేసి ధ్రువీకరణ పత్రాలు జారీ చేశాం. జిల్లాలో విద్యా సంస్థల బస్సులను ఆకస్మికంగా తనిఖీ చేసి, ఎఫ్‌సీ, పర్మిట్, కండిషన్ లేని వాటిని సీజ్ చేస్తాం.

–కె.వి.ప్రకాష్, జిల్లా రవాణా శాఖ అధికారి, అనకాపల్లి

వర్షాధార పంటలకు వాతావరణం అనుకూలం

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ జగన్నాథరావు

అనకాపల్లి : వర్షాధార పంటలకు ప్రస్తుత వాతావరణం అనుకూలంగా ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ పి.వి.కె.జగన్నాథరావు తెలిపారు. స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాగల ఐదు రోజుల్లో వర్ష సూచన ఉన్నందున తేమను సద్వినియోగం చేసుకోవాలని, వర్షాధార చెరకు పంటలకు నేలను తయారు చేసుకోవాలని ఆయన సూచించారు. తేమను ఉపయోగించి 120 రోజుల వయస్సు గల చెరకు మొక్క, కార్సి చేసిన తోటలో మొక్కల మొదళ్లకు ఎత్తుగా మట్టిని ఎగదోయాలన్నారు. ఖరీఫ్‌లో కొర్రను వేసుకునే రైతులు, అధిక దిగుబడి వచ్చే తక్కువ కాల పరిమితిగల రకరాలైన గరుడ, సూర్యనంది, రేనాడు వంటి రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఖరీఫ్‌లో విత్తుకోవడానికి అనువైన రకాలైన ఆర్‌జీఎల్ 2537, బీపీటీ 5204, 3291,ఎంటీయూ 1262, 1318, 1224, 1064 వంటి రకాలను ఎంపిక చేసుకుని విత్తనాన్ని సేకరించుకోవాలన్నారు. వర్షాలను ఉపయోగించుకుని నేలను 2–3 సార్లు మెత్తగా దుక్కిచేసి చదును చేసుకుని విత్తటానికి నేలను సిద్ధం చేసుకోవాలని ఆయన చెప్పారు. నువ్వు పైరును ఈ నెలాఖరులోగా వేసుకోవాలని, రైతులు వర్షాలను ఉపయోగించుకుని వెంటనే నేలను దున్ని తయారు చేసుకుని నువ్వులలో అధిక దిగుబడినిచ్చే వైఎల్‌ఎం 17 లేదా వైఎల్‌ఎం 66 రకాలను విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలన్నారు. ఆఖరి దుక్కిలో యూరియా 22 కిలోలు, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 63 కిలోలు, మ్యురేట్ ఆఫ్ పొటాస్ 17 కిలోల చొప్పున వేసుకోవాలని ఆయన తెలిపారు. జనుము, జీలుగ, పిల్లిపెసర, పెసర వంటి పచ్చి రొట్ట పైరులను వరికి ముందు వేసుకుని, 40–45 రోజుల తరువాత నేలలో కలియ దున్నకుంటే, వరి దిగుబడులు పెరగడమే కాకుండా నేల ఆరోగ్యంగా ఉంటుందన్నారు.

కంటి క్యాన్సర్‌పై అవగాహన అవసరం

బీచ్‌రోడ్డు: వైటాథాన్ పేరుతో ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం కంటి క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు జరిగిన ఈ అవగాహన ర్యాలీని రెటినోబ్లాస్టోమా కంటి క్యాన్సర్‌ను జయించిన వనుము చంద్రశేఖర్, అర్జున్ అవార్డు గ్రహీత జయరామ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి హెడ్ డాక్టర్ వీరేందర్ సచ్‌దేవా మాట్లాడుతూ ప్రజలు కంటి క్యాన్సర్ సాధారణ లక్షణాల గురించి తెలుసుకోవటం, సకాలంలో వైద్య సహాయం తీసుకోవడం చాలా ముఖ్యమన్నారు. రెటినోబ్లాస్టోమా అత్యంత సాధారణ లక్షణం వైట్ రిఫ్లెక్స్ అని తెలిపారు. వైట్ రిఫ్లెక్స్ అనేది తెల్లటి లేదా పసుపు తెలుపు కాంతి... పిల్లల కంటిపై కాంతి పడినప్పుడు, ఫ్లాష్‌తో ఫొటో తీసినపుడు కళ్లు సరిగా కనిపించకపోవటం, ఎర్రబడటం, మెల్లకన్ను వంటి ఇతర లక్షణాలు కనిపిస్తాయన్నారు. కార్యక్రమంలో భాగంగా జంబో డ్యాన్స్ చేసి అలరించారు. ఈ వైటాథాన్‌లో సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు 14 మంది ఎంపిక



రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో బద్రీనాథ్

అనకాపల్లి: రాష్ట్రస్థాయి 11వ పవర్‌లిఫ్టింగ్ పోటీలు ఈ నెల 29, 30, 31 తేదీల్లో మంగళగిరిలో జరుగుతాయని, ఈ పోటీలకు జిల్లా నుంచి 14 మంది క్రీడాకారులను ఎంపికయ్యారని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బద్రీనాథ్ తెలిపారు. స్థానిక గాంధీనగరం ఎస్‌ఎస్‌ఎస్ జిమ్‌లో పవర్‌లిఫ్టింగ్ ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్ స్త్రీ, పురుషుల విభాగాల్లో జిల్లా నుంచి క్రీడాకారులను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ పోటీల్లో జిల్లాలోని 12 జిమ్‌ల నుంచి 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. 53 కేజీల విభాగంలో సబ్ జూనియర్ పోటీలకు జి.భానుప్రసాద్, 66 కేజీల జూనియర్ విభాగంలో భానుతేజ, కె.జగన్నాథరావు, 83 కేజీల జూనియర్ విభాగంలో ఎస్.బాల సాయి చరణ్, 93 కేజీల జూనియర్ విభాగంలో పి.దినేష్, 76 కేజీల జూనియర్ మహిళా విభాగంలో కె.ప్రవల్లిక, 59, 66, 93, కేజీల సీనియర్ విభాగాల్లో ఆర్.నరసింహారాజు, కె.వి.వి.ఎస్.పి. ప్రసాద్, ఈ.గణేష్, 57 కేజీల సీనియర్ మహిళా విభాగంలో రాజనాల పూర్ణ, 59 కిలోల మాస్టర్–2 లో ఎం.శ్రీనివాసు బెంచ్‌ప్రెస్ పోటీలకు, 93 కిలోల జూనియర్ విభాగంలో సాయి భాను దీపక్, 57 కిలోల మహిళా విభాగంలో జె.రామలక్ష్మి, 83 కిలోల మాస్టర్ –1లో ఎ.గణేష్ ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.ఎల్.వి.నాగరాజు నీలా, కోశాధికారి వేగి అజయ్, ఉపాధ్యక్షులు బి.శ్రీనివాస్, అందే గణేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు వసాది నానాజి, బొద్దపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో భక్తులు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధికసంఖ్యలో పిల్లాపాపలతో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు తమ ఇళ్ల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలైన్లన్నీ నిండిపోవడంతో ఆలయ రహదారిపై భక్తులు బారులు తీరారు. వృద్ధులు, గర్భిణులకు అమ్మవారి దర్శనానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బిందు సేద్యం.. సిరులు తథ్యం

సూక్ష్మ(బిందు, తుంపర్ల) సేద్యం.. తక్కువ నీటి వినియోగంతో మేలైన సాగు మార్గం. నేరుగా మొక్కలకు మాత్రమే నీరందించే వ్యవస్థ. దీంతో కలుపు, చీడ పీడల బెడద చాలా తక్కువ. విద్యుత్, ఎరువులు, కూలీల వినియోగం కూడా నామమాత్రమే. వీటన్నింటికీ తోడు ప్రభుత్వం అందించే రాయితీ. దీంతో సూక్ష సేద్యం వైపు రైతుల ఆసక్తి పెరుగుతోంది. ఈ ఏడాది జిల్లాలో 1200 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం చేపట్టాలన్నది అధికారుల లక్ష్యం.

- సూక్ష్మ నీటి సాగుపై రైతుల్లో పెరుగుతున్న ఆసక్తి
- నీరు, విద్యుత్, ఎరువులు, కూలీల వినియోగం తగ్గుదల
- డ్రిప్ యూనిట్‌కు 90 శాతం, స్ప్రింక్లర్లకు 55 శాతం రాయితీ
- జిల్లాలో 825 హెక్టార్లలో రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్ల యూనిట్లు ఏర్పాటు



వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేసిన కొత్త యూనిట్‌తో రైతులు, అధికారులు



కొత్తగా ఏర్పాటుచేసిన పైపుల నాణ్యతను పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ జీవీ లక్ష్మి

నాతవరం: ఏపీ సూక్ష్మ సాగునీటి పథకం(ఏపీఎంఐపీ)లో భాగంగా బిందు(డ్రిప్), తుంపర్ల(స్ప్రింక్లర్) సేద్యానికి ప్రభుత్వం రాయితీపై యూనిట్లు ఏర్పాటు చేస్తుండటంతో రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఉద్యాన, వ్యవసాయ పంటల నాణ్యతను మెరుగుపర్చడంలో డ్రిప్ ఇరిగేషన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. తక్కువ నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో రైతుల్ని ఈ దిశగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల ద్వారా దరఖాస్తు చేసుకున్న రైతుల్లో అర్హులకు రాయితీపై ఈ యూనిట్లను అందిస్తోంది.

1200 హెక్టార్ల సాగు లక్ష్యం

సూక్ష్మ సాగు నీటి పథకం 2023–24కి గాను ప్రభుత్వం జిల్లాలోని 24 మండలాల్లో 1200 హెక్టార్లకు సాగు విస్తరించాలని లక్ష్య నిర్దేశం చేసుకుంది. ఇంత వరకు 880 మంది రైతులకు 825 హెక్టార్లల్లో ఈ పథకంలో భాగంగా యూనిట్లు ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఏపీఎంఐపీ పథకాన్ని అమలు చేస్తున్నాయి. రాయితీపై ఈ యూనిట్లు పొందేందుకు రైతుకు చెందిన భూమిలో నీరు, విద్యుత్ వసతి తప్పనిసరి. డ్రిప్ ఇరిగేషన్ కోసం 5 ఎకరాల్లోపు భూమి ఉన్న రైతుకు 90 శాతం రాయితీపై యూనిట్‌ను ఏర్పాటు చేశారు. అంతకు మించి భూములున్న రైతులకు 55 శాతం మాత్రమే రాయితీ లభిస్తుంది. తుంపర్ల సేద్యంలో యూనిట్ మంజూరుకు ఐదెకరాల్లోపు రైతులకు 55 శాతం రాయితీ, అంతకు మించి భూమి ఉన్నవారికి 45 శాతం రాయితీ అందిస్తున్నారు.

ఆర్బీకేల ద్వారా రిజిస్ట్రేషన్లు

అర్హులైన రైతులు ముందుగా ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 2,011 మంది రైతులు 2,071 హెక్టార్లలో సాగు కోసం దరఖాస్తు చేసుకున్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన తర్వాత ప్రభుత్వ నిబంధనల మేరకు 1,259 మంది రైతులు, 1,209 హెక్టార్ల సాగుకు అర్హత పొందారు. కలెక్టర్ ఆమోదంతో వీరికి రూ.5,16,15,697 వ్యయంతో 825 హెక్టార్లలో బిందు, తుంపర్ల యూనిట్లు ఏర్పాటు చేశారు. మిగిలిన రైతుల దరఖాస్తులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయి.

పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ

డ్రిప్ ఇరిగేషన్‌లో పంటల సాగు ద్వారా నీరు, విద్యుత్, ఎరువుల వృధా అరికట్టవచ్చు. కూలీల అవసరం కూడా చాలా తక్కువ. కలుపు మొక్కలు, తెగుళ్ల సమస్య తగ్గుతుంది. దీంతో పంట సాగులో పెట్టుబడి వ్యయం బాగా తగ్గి, దిగుబడి పెరుగుతుంది. కాలానుగుణంగా వస్తున్న ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో నాణ్యమైన పంట ఉత్పత్తులకు, దిగుబడులకు సూక్ష్మ సాగు విధానం దోహదపడుతోంది. రైతుల్లో ఆర్థిక పరిపుష్టి సాధ్యమవుతోంది. ఈ పథకం కోసం జిల్లా వ్యాప్తంగా మండలాల్లో అవగాహన సదస్సుల ద్వారా రైతుల్లో చైతన్యం పెంచుతున్నారు. గతంలో ఈ పథకం పొందేందుకు జిల్లా కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్బీకేల ద్వారా రైతులు తమ స్వగ్రామంలోనే దరఖాస్తు చేసుకోవచ్చు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



నిబంధనల మేరకు అర్హత ఉన్న రైతులందరికీ డ్రిప్ స్ప్రింక్లర్ల యూనిట్లు అందిస్తున్నాం. సూక్ష సాగు నీటి పథకం ద్వారా సాగు చేసే రైతులు తక్కువ పెట్టుబడితో, అధిక ఆదాయం పొందవచ్చు. ఆసక్తి ఉన్న రైతులు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్బీకేల ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి. క్షేత్ర స్థాయిలో పరిశీలించి కలెక్టరుకు నివేదిస్తాం. కలెక్టర్ ఆమోదం తర్వాత యూనిట్లు ఏర్పాటు చేస్తాం. గతంతో పోల్చుకుంటే రైతుల్లో బిందు సేద్యం పట్ల ఆసక్తి గణనీయంగా పెరిగింది.

– జీవీ లక్ష్మి, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి, ఏపీఎంఐపీ పథకం, అనకాపల్లి

రంగస్థల కళాకారులకు సత్కారం



కళాకారులు రొంగలి శ్రీరాములు, బగాది విజయసారథి

సీతంపేట(విశాఖ): ప్రముఖ పౌరాణిక పద్య నాటక తెలుగు రంగస్థల కళాకారులు రొంగలి శ్రీరాములుకు 'అభినవ సౌభల', బగాది విజయసారథికి 'నట నక్షత్ర' బిరుదులు ప్రదానం చేశారు. భగవాన్ శరణం కల్చరల్ అసోసియేషన్, పిల్లుట్ల ఆర్ట్స్ అకాడమీ సంయుక్త నిర్వహణలో ఆదివారం సాయంత్రం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో కళాకారులు, సాహితీవేత్తల సమక్షంలో బిరుదులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. జీవీఎంసీ సెక్రటరి పల్లి నల్లనయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన అఖిల భారత తెలుగు కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ చేతుల మీదుగా వీరిని సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని, పద్యం ప్రాభవాన్ని ,పౌరాణిక నాటక ప్రతిష్టను కొనియాడారు పల్లి నాగభూషణరావు, సీహెచ్ రామ్ నారాయణ, డీవీ సూర్యారావు, పిల్లుట్ల లక్ష్మీగోపి నరసింహ శర్మ, పొలమరశెట్టి ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తిపై కేసు

మాకవరపాలెం: మద్యం బాటిళ్లు అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని రామన్నపాలేనికి చెందిన మాకిరెడ్డి అప్పలనాయుడు ఆదివారం మాకవరపాలెం నుంచి రామన్నపాలేనికి 12 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేసి 108 స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. అర్చకుడు అప్పాజీ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

మెట్ట భూముల్లో ఆయిల్‌పామ్ సిరులు

- గిరిజన గ్రామాల్లో పెరుగుతున్న విస్తీర్ణం
- ప్రస్తుతం టన్ను పామాయిల్ రూ.14,095
- జిల్లాలో 7800 ఎకరాల్లో సాగు

ఒకప్పుడు బీడు భూములుగా వున్న ప్రాంతం అంతా నేడు ఆయిల్ పామ్ తోటలతో కళకళలాడుతోంది. చెరకు, సరుగుడు, తోటల స్థానంలో రైతులు పామాయిల్ తోటలు సాగు చేయడానికి మొగ్గు చూపిస్తున్నారు. వాణిజ్య పంటగా విరాజిల్లుతున్న ఆయిల్‌పామ్‌ను ముఖ్యంగా మండలంలో గిరిజన గ్రామాల్లో విస్తారంగా సాగు చేస్తున్నారు. జిల్లాలో దాదాపు 7800 ఎకరాల్లో సాగవుతోంది.



రవాణాకు సిద్ధం చేసిన పామాయిల్ గెలలు



తోటల పెంపకంపై గిరి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంహెచ్‌వో పుష్పలీలావతి (ఫైల్)



ఎ. వీరనారాయణంలో పామాయిల్ తోటలో అంతర పంటగా కోకో పంట

మాడుగుల రూరల్ : జిల్లాలో చెరకు, సరుగుడు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. చెరకు పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం, అలాగే సరుగుడు తోటల ధర కావడం రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించేలా చేస్తోంది. ఈ రెండు పంటలుకు ప్రత్యామ్నాయంగా ముఖ్యంగా గిరిజన, మెట్ట ప్రాంతాల్లో పామాయిల్ తోటలు సాగు చేస్తున్నారు. ఉద్యానవనశాఖ పలు రాయితీలు ప్రకటించడంతో పాటు డ్రిప్ ఇరిగేషన్ సదుపాయం కూడా కల్పించారు. ప్రస్తుతం 2019 సంవత్సరం తర్వాత గ్రామ స్థాయిలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిన తర్వాత సచివాలయంలో ఉద్యానవనశాఖాధికారి రైతులకు తోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా పామాయిల్, కోకో, అరటి, తదితర పంటలు పెంపకం, వాటి వల్ల వచ్చే లాభాలు గురించి అవగాహన కల్పిస్తున్నారు. మండలంలో తాటిపర్తి, శంకరం, జాలంపల్లి, అవురువాడ, ఎల్.పొన్నవోలు, పొంగలిపాక, గ్రామ పంచాయతీల పరిధిలో శివారు గ్రామాల్లో సుమారు 175 ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నారు. పామాయిల్ వేసిన తర్వాత నాలుగు నుంచి ఐదేళ్ల తరువాత తోటలు కాపునకు వస్తాయి. హెక్టారుకు రూ.5,250 చొప్పున నాలుగేళ్ల పాటు రాయితీ ఉద్యానవన శాఖ ద్వారా ఎరువులు వినియోగానికి అందిస్తున్నారు. డ్రిప్ ఇరిగేషన్ సదుపాయం ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు వారు అందిస్తున్నారు. జిల్లాలో టెనీరా రకం పామాయిల్‌ను ఎక్కువగా సాగు చేస్తున్నారు. పండిన పామాయిల్ ఫ్రూట్‌ను కాటాల వద్ద తూకం వేసి, అనంతరం బంగారుమెట్టతో పాటు తూర్పుగోదావరి జిల్లాలో గల పెద్దాపురం, తదితర చోట్ల గల ఆయిల్‌పామ్ కంపెనీలకు రవాణా చేస్తున్నారు. అక్కడ టన్నుకు ధర నిర్ణయించి నగదు రైతులకు చెల్లిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో...

ఉమ్మడి జిల్లాలో అనకాపల్లి, మాడుగుల, బుచ్చెయ్యపేట, కశింకోట, కె.కోటపాడు, దేవరాపల్లి, రావికమతం, నక్కపల్లి, పాయకరావుపేట, అచ్యుతాపురం, మునగపాక, యలమంచిలి, చీడికాడ,సబ్బవరం, ఆనందపురం, భీమిలి, పద్మనాభం, కోటవురట్ల, పాయకరావుపేట, నర్సీపట్నం, యలమంచిలి, నాతవరం, మాకవరపాలెం, గోలుగొండ, రాంబిల్లి, రోలుగుంట తదితర మండలాల్లో ఆయిల్‌పామ్ విరివిగా సాగవుతోంది. గత రెండేళ్లలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 7800 ఎకరాల్లో సాగు అవుతుంది. పామాయిల్ మొక్క ఖరీదు రూ.133 కాగా, 90 శాతం రాయితీతో మొక్కలను రైతులకు పామాయిల్ కంపెనీ వారు అందిస్తున్నారు. రాయితీ సొమ్ము ఆయా రైతుల ఖాతాలో జమ చేస్తున్నారు. ఈ ఏడాది టన్ను ధర రూ.14,095లుగా ఉంది. రావికమతం, చోడవరం, బుచ్చెయ్యపేట, మండలాల్లో 120 ఎకరాల్లో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. తోటబడి కార్యక్రమం ద్వారా రైతులకు పామాయిల్ సాగుపై అవగాహన కల్పిస్తున్నారు.

రాయితీలతో ప్రోత్సాహం



మాగాణి భూముల్లో ఆయిల్ పామ్ తోటలు వేసుకోవడం ఎంతో శ్రేయస్కరం. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి. ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా కోకో, అరటి పంట కూడా సాగు చేసుకోవచ్చు. ఈ అంతర పంటలకు కూడా ప్రభుత్వం రాయితీలు కల్పించింది. రెండేళ్లలో మండలంలో పామాయిల్ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.

– వి. భానుపుష్పలీలావతి, మండల ఉద్యానవనశాఖాధికారి, మాడుగుల మండలం

15 రోజులకోసారి చెల్లింపులు



ఆయిల్‌ఫామ్ ఫ్రూట్ సరఫరా చేసిన రైతులకు స్వల్ప కాలంలో ప్రతి 15 రోజులకు ఒకసారి కంపెనీ వారు చెల్లింపులు అందిస్తున్నారు. మాడుగుల మండలంలో తాటిపర్తి నుంచి శంకరం మధ్యలో కాటా దగ్గర రైతుల నుంచి ఫ్రూట్ కొనుగోలు చేస్తున్నారు. ఈ ఫ్రూట్‌ను బంగారమెట్ట వద్ద గల ఆయిల్‌పామ్ కంపెనీకి తరలిస్తాం.

– జి.వి.దుర్గారావు, ఆయిల్‌ఫామ్ ఫీల్డ్ అసిస్టెంట్, మాడుగుల మండలం

అంతర పంటల వల్ల అధిక ఆదాయం



ఆయిల్ ఫామ్‌లో అంతర పంటలుగా కోకో, అరటి తోటలు వల్ల రైతుకు లాభం వస్తుంది. కోకో పంట కూడా నాలుగేళ్ల తర్వాత పక్వానికి వస్తుంది. డ్రిప్ ఇరిగేషన్, ఇతర రాయితీలు సద్వినియోగం చేసుకుంటున్నాం.

– బండారు శ్రీరాములు, బావన్నపాలెం, రైతు, మాడుగుల మండలం

జిల్లాలో పెరుగుతున్న సాగు



జిల్లాలో సుమారు 7800 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగువుతుంది. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించి హెక్టారుకు రూ.5,250 నాలుగు సంవత్సరాల పాటు రాయితీ కల్పించడం జరుగుతుంది. ఈ నగదు ఎరువులు వినియోగానికి రైతు ఖాతాకు జమా చేస్తాం. ఉద్యానవనశాఖ ద్వారా ఈ రాయితీ కల్పిస్తున్నాం.

– జి. ప్రభాకర్‌రావు, జిల్లా ఉద్యానవనశాఖాధికారి, అనకాపల్లి జిల్లా

ఐద్వా జిల్లా అధ్యక్షురాలిగా మాణిక్యం

- ప్రధాన కార్యదర్శిగా వరలక్ష్మి




మాణిక్యం



వరలక్ష్మి

అనకాపల్లి : అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా అధ్యక్షురాలుగా పి.మాణిక్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా డి.డి.వరలక్ష్మి, కోశాధికారిగా కె.వి.సూర్యప్రభ, ఉపాధ్యక్షురాలుగా ఎల్.గౌరీ, సహాయ కార్యదర్శిగా రావి లక్ష్మి, కమిటీ సభ్యులుగా వాణిశ్రీ, మానస, ఆర్.లక్ష్మి, యూ.లోవ, ఎం.శ్రీదేవి, మంగతాయారు, రెడ్డి వరలక్ష్మి, ఆఫీస్ బేరర్లుగా యు.నాగమణి, లావణ్య, సుస్మిత, కుమారి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి మాట్లాడుతూపై కమిటీ ఎన్నిక రెండు సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. మహిళలందరూ బాగా చదువుకుని విద్యావంతులు కావాలని, తమ సమస్యలు పరిష్కరించుకునే పరిజ్ఞానం సంపాదించుకోవాలని ఆమె కోరారు. మహిళలు అనేక రంగాలలో వివిధ స్థాయిల్లో అభివృద్ధి సాధించాలని, ఉన్నత స్థాయికి చేరుకోవాలని, సమస్యల పరిష్కారం కోసం మహిళలందరూ ఐకమత్యంగా పోరాటాలు చేయాలని ఆమె కోరారు. దేశంలో సుమారుగా కోటి 50 లక్షల మంది మహిళలు ఐద్వా సభ్యులుగా ఉన్నట్లు చెప్పారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



దోకల నాయుడు (ఫైల్)



ఉరేసుకున్న దోకల నాయుడు

చీడికాడ: మండల కేంద్రానికి చెందిన దోకల నాయుడు (45) చింత చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. దీనికి సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ నారాయణరావు అందించిన వివరాలు. మృతుడు నాయుడు పెదగంట్యాడ సమీపంలోని సీతానగరానికి చెందిన మంగదేవిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. మృతుడికి గతంలో రెండు వివాహాలు జరిగాయి. ప్రస్తుతం మంగదేవితో ఉంటూ, పెదగంట్యాడలో కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారు. భార్యతో తరచూ గొడవలు పడేవాడు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 24న ఉదయం 8.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లి పోయాడు. ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని డోకల మరిడమ్మ కల్లం పాకల వద్ద చింత చెట్టుకు ఉరేసుకుని మరణించాడు. తొలుత దీన్ని గుర్తించిన చీడికాడకు చెందిన బోడ్డు ఎర్రినాయుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసుల ద్వారా విషయం తెలుసుకున్న భార్య మంగదేవి ఆదివారం సంఘటనా స్థలానికి చేరుకుని బోరుమంది. తన భర్త ఐదేళ్లుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని, చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై ఉరి వేసుకుని చనిపోయి ఉంటారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టానికి పంపించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

31వ తేదీలోగా కౌంటింగ్ ఏజెంట్ల పేర్లు ఇవ్వాలి

మహారాణిపేట (విశాఖ) : వచ్చేనెల 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం ఈనెల 31వ తేదీలోగా అభ్యర్థులు తమ ఏజెంట్ల జాబితాను రిటర్నింగ్ అధికారులకు ఇవ్వాల్సి ఉంది. ఒక్కొక్క టేబుల్‌కు ఒక్కో ఏజెంటును నియమిస్తారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 14 మంది ఏజెంట్లు, పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో టేబుల్‌కు ఒకరు చొప్పన ఏజెంట్లను నియమిస్తారు.

ఏజెంట్లుగా ఉండాలంటే..

- 18 ఏళ్లు నిండిన వ్యక్తులను తమ ఏజెంట్లగా అభ్యర్థులు నియమించుకోవచ్చు.
- భారత పౌరసత్వం ఉన్న ఎన్నారైలు కూడా ఏజెంట్లగా ఉండొచ్చు
- సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఏజెంట్లగా వెళ్లడానికి అనుమతి ఉంటుంది.
- కౌంటింగ్ హాలులోకి అభ్యర్థిని లేదా చీఫ్ ఎలక్షన్ ఏజెంట్‌ను అనుమతి ఇస్తారు.
- ఏజెంట్లను హాలు బయట ఉంచుతారు.
- ఏజెంట్లకు అవసరమైన ఆహారం కూడా అభ్యర్థే భరించాలి
- కౌంటింగ్ హాలులో టేబుళ్లకు అనుగుణంగా ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలి.

‘12 వేల మెజారిటీతో విజయం సాధిస్తా..’



పార్టీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

- జిల్లాలో 6 అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానం వైఎస్సార్‌సీపీదే..
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో మలసాల భరత్

అనకాపల్లి : మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 9న విశాఖ కేంద్రంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో జీవీఎంసీ పరిధిలో ఆ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు మౌనంగా ఉండడంతో అవతల వ్యక్తులు సైరన్ మోగిస్తున్నారని, జూన్ 4న సార్వత్రిక ఫలితాల్లో అనకాపల్లి ఎమ్మెల్యేగా తాను 12వేల ఓట్లు మెజార్టీతో గెలుపు ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. విజయోత్సవ సంబరాలు స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆయన చెప్పారు. గ్రామీణ స్థాయి నుంచి పార్టీ శ్రేణులు తన గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేశారని ఆయన పేర్కొన్నారు. తాను పదేళ్లు అమెరికాలోను కుటుంబ సమేతంగా జీవించానని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదంతో అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలోకి దిగిన వెంటనే పార్టీ శ్రేణులు నాలుగు మాసాలు శక్తి వంచన లేకుండా ఎన్నికలకు పని చేశారని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నియోజకవర్గంలో చిన్న సాఫ్ట్‌వేర్ కంపెనీని త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి మహిళలు, యువత, వృద్ధులు ప్రశాంతంగా వైఎస్సార్ సీపీ గెలుపుకోసం సైలెంట్‌గా ఓటు వేశారని అన్నారు. జిల్లాలో 6 అసెంబ్లీ, ఎంపీ స్థానాలను అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ జూన్ 4 ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి ప్రభంజనం సృష్టించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, జూన్ 9న విశాఖ కేంద్రంగా మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తారని ఆయన చెప్పారు. అంతకుముందు పార్టీ సీనియర్ నాయకులు ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహం, జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.వి. రత్నకుమారి, కశింకోట మండలం జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ సీనియర్ నాయకులు ఉగ్గిన అప్పారావు, కొణతాల భాస్కర్, మూనూరు శ్రీనివాసరావు, నర్సింగరావు, కొండూరు రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

డీ -ఫార్మసీతో ఉపాధికి భరోసా

- 8 ప్రభుత్వ, ఒక ఎయిడెడ్, 35 ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో కోర్సులు
- కోర్సు వ్యవధి రెండేళ్లు



కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఫార్మసీ కాలేజీ



ప్రయోగశాలలో తర్ఫీదు పొందుతున్న విద్యార్థులు

మురళీనగర్ (విశాఖ): ఇంటర్మీడియట్ అనంతరం ఫార్మసీ రంగంలో శిక్షణ పొందేందుకు డిప్లమా ఇన్ ఫార్మసీ కోర్సు అందుబాటులో ఉంది. ఈ కోర్సు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లతో పాటు కొన్ని ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో కూడా నిర్వహిస్తున్నారు. ఈ కోర్సు చేసిన విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌తో ఫార్మసీ కంపెనీలతో పాటు ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేసే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ రంగం ఆస్పత్రుల్లోనూ ఉద్యోగావకాశాలు ఉన్నాయి. ఈ కోర్సు పూర్తి చేసిన వారు తక్షణ ఉపాధి అవకాశాలు పొందవచ్చు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లాంటి కాలేజీల్లో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

కోర్సు కాల వ్యవధి: రెండేళ్లు. అనంతరం మూడు నెలల ప్రభుత్వ ఆస్పత్రిలో శిక్షణ ఉంటుంది.

విద్యార్హత: ఇంటర్మీడియట్ ఎంపీసీ లేదా బైపీసీ, నేషనల్/ స్టేట్ ఓపెన్ స్కూల్ లో ఇంటర్మీడియట్ ఎంపీసీ లేదా బైపీసీ, సీబీఎస్‌ఈ /ఐసీఎస్‌ఈ బోర్డు ద్వారా ఇంటర్మీడియట్‌కు సమానమైన పరీక్ష ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు. https://apsbtet.in/pharmacy వెబ్‌సైట్లో నేరుగా జూన్ 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 21 నుంచే దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రారంభమయ్యింది.

ఎంపిక విధానం: కోర్సులో శిక్షణకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల మార్కుల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ నిర్ణయం మేరకు మెరిట్ ప్రాతిపదికగా ర్యాంకులు కేటాయిస్తారు. కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు అవకాశాలను బట్టి కళాశాలలను ఎంపిక చేసుకోవచ్చు.

కళాశాలల వివరాలు : రాష్ట్రంలో 8 ప్రభుత్వ కళాశాలలు, ఒక ఎయిడెడ్ కళాశాల 35 ప్రయివేటు కాలేజీలు ఉన్నాయి. కోస్తాంధ్రాలో విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ , శ్రీకాకుళం, కాకినాడ, గుంటూరు మహిళా పాలిటెక్నిక్, రాయలసీమలో తిరుపతి, కర్నూలు ప్రభుత్వ పాలిటెక్నిక్, కడప, హిందూపూర్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా ఎయిడెడ్ పాలిటెక్నిక్.

పాఠ్యాంశాలు : ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ప్రథమ సంవత్సరంలో ఐదు సబ్జెక్టులు, రెండో సంవత్సరంలో ఆరు సబ్జెక్టులతో పాటు కోర్సులో భాగంగా మందులు తయారు చేయడం, మానవ శరీర అవయవాల మీద మందులు పని చేసే విధానం , ఔషధ మొక్కలు, ఫార్మసీ చట్టాలపై అవగాహన, ఫార్మసిస్టుగా డ్రగ్స్ డిస్పెన్సింగ్, పేషంట్ కౌన్సిలింగ్‌లో అవగాహన కల్పిస్తారు. రెండేళ్ల కోర్సులో సబ్జెక్ట్ నాలెడ్జ్‌తో పాటు ప్రాక్టికల్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. రెండు నెలలు కోర్సు పూర్తి చేసిన అనంతరం మూడు నెలలు ప్రయివేటు ఆస్పత్రుల్లో శిక్షణ ఇస్తారు.

ఉపాధి అవకాశాలు : డిప్లమా ఇన్ ఫార్మసీ పూర్తి చేసిన వెంటనే ఉపాధి అవకాశాలు విస్తృతంగా అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ వైద్యశాలలు, పరిశ్రమలు, రైల్వే ఆస్పత్రులు, ప్రైవేట్ ఆస్పత్రిలో కమ్యూనిటీ ఫార్మసిస్ట్, హాస్పిటల్ ఫార్మసిస్ట్, మార్కెటింగ్ డ్రగ్ రిప్రజెంటేటివ్ ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. ఔషధ దుకాణాలలో రిటైల్ ఫార్మసిస్టులుగా ఉద్యోగాలు ఉన్నాయి. ఫార్మస్యూటికల్ కంపెనీల్లో ఫార్మసీ సూపర్‌వైజర్, ఫార్మసిస్టు ఉద్యోగాలు పొందవచ్చు. ఆర్థిక స్థోమత ఉన్నవారు సొంతంగా మెడికల్ షాపు ఏర్పాటు చేసుకొని తనతోపాటు మరి కొంతమందికి ఉపాధి కల్పించవచ్చు. ఈ రంగంలో వేతనాలు అధికంగా ఉన్నందున ఎక్కడైనా ఉపాధికి భరోసా ఉండడంతో కోర్సుకు డిమాండ్ ఎక్కువగా ఉంది. డి.ఫార్మసీ కోర్సు చదివిన తర్వాత ఉన్నత చదువులకు ఈసెట్ ద్వారా బి. ఫార్మసీ రెండో సంవత్సరంలోకి చేరవచ్చని, ఫీజు రీయింబర్స్‌మెంటు వర్తిస్తుందని కంచరపాలెం ఫార్మసీ హెడ్ జె.గోవర్ధన రావు తెలిపారు.

అత్యుత్తమ బోధన



కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 1966లో ఫార్మసీ డిప్లమా కోర్సు ప్రారంభించారు. ఇక్కడ 60 సీట్లు అందుబాటులో ఉన్నాయి. హాస్టల్ సౌకర్యం ఉంది. ఇక్కడ చదివిన విద్యార్థులు ఫార్మసీ, ఫార్మాస్యూటికల్ కంపెనీలలో ఉపాధి పొందుతున్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి క్యాంపస్ డ్రైవ్‌లో 39 మంది ఎంపికయ్యారు. ఏడుగురు విద్యార్థులు ఉన్నత విద్య కోసం వెళ్తున్నారు. మా దగ్గర అధునాతన ప్రయోగశాల, ఉన్నత అర్హతలు కలిగిన ఫ్యాకల్టీ ఉంది. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఉపాధి, ఉన్నత విద్యకు ఈ కోర్సులో చేరడం ఉత్తమం.

–డాక్టర్ కె.నారాయణరావు, ప్రిన్సిపాల్, కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్

క్లుప్తంగా

28న వైఎస్సార్‌సీపీ మండల సమావేశం

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డులోని వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో ఈనెల 28న ఉదయం 10 గంటలకు అనకాపల్లి మండల పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్‌ తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌ కుమార్‌ విచ్చేస్తారని చెప్పారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు నీతి కథల బోధన



విద్యార్థులకు నీతి కథలు చెబుతున్న రిసోర్స్‌ పర్సన్‌ అచ్యుత

అచ్యుతాపురం: అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు తెలుగు భాష, నీతి కథలు తెలిపారు. రిసోర్స్‌ పర్సన్‌గా వ్యవహరించిన అచ్యుత విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు చేతుల మీదుగా చాక్లెట్లు పంపిణీ చేశారు.

మద్యం సీసాలతో ఇద్దరి అరెస్ట్‌

కోటకోట: మండలంలో రెండుచోట్ల అక్రమంగా అమ్మకానికి 19 మద్యం సీసాలు తరలిస్తుండగా ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపారు. తీడ శివారు కచ్చళ్లపాలేనికి చెందిన యర్ర అప్పలనాయుడును 12 క్వార్టర్‌ సీసాలతో, అలాగే నరసింగబిల్లిలో ఏడు మద్యం సీసాలు తరలిస్తున్న ఏనుగుతునికి చెందిన వై. బాపూజీ అరెస్టు చేశామన్నారు. తమ గ్రామాల్లో విక్రయించడానికి తరలిస్తుండగా మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

యోగాసనాలతో ఆరోగ్యం

అనకాపల్లి: ఆహారం తీసుకున్నంత కాలం ఆసనాలు, ప్రాణం ఉన్నంత వరకూ ప్రాణాయామం చేయాలని పతంజలి హరిద్వార్‌ తెలుగు ఉమ్మడి రాష్ట్రాల పర్యవేక్షకులు స్వామి రితిదేవ్‌ మహారాజ్‌జీ అన్నారు. స్థానిక జార్జిక్లబ్‌ ఆవరణలో ఆదివారం పతంజలి వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యోగా నేర్చుకున్న వ్యక్తులకు శిక్షకులుగా వెళ్లవచ్చని పేర్కొన్నారు. దేశంలో సంస్కృతి సంప్రదాయాలు కాపాడడానికి పతంజలి హరిద్వార్‌ భారతీయ శిక్షణ బోర్డు కృషిచేస్తుందన్నారు. కరోనా సమయంలో తక్కువ ఖర్చుతో పతంజలి హరిద్వార్‌ ఆయుర్వేదిక్‌ మందులు తయారు చేసి ఎంతో మందిని కాపాడిందన్నారు. యోగా సభ్యులు, జార్జిక్లబ్‌ సభ్యులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

దర్టీ ఫెలో	: రాజా
ఫ్యూరియోసా	: సత్యనారాయణ స్క్రీన్‌-1
వ్యాన్‌	: సత్యనారాయణస్క్రీన్‌-2
బాక్‌	: షిర్డిసాయి
ఆ ఒక్కటీ అడక్కు	: పర్తిసాయి
రాజుయాదవ్‌	: వెంకటేశ్వర
మంజుమ్మల్‌ బోయ్స్‌	: శ్రీసత్య
కృష్ణమ్మ	: రామచంద్ర

బెల్లం ధరలు

ఆదివారం మార్కెట్‌ సెలవు
శనివారం 726 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్‌ రకం	4,700	5,100
మొదటి రకం	3,900	4,930
రెండో రకం	3,800	4,450
మూడోరకం	3,550	4,120

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్‌ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 59 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్‌-7 యూనిట్లు, బీ పాజిటివ్‌-33 యూనిట్లు, బీ నెగిటివ్‌-2 యూనిట్లు, ఓ పాజిటివ్‌-12 యూనిట్లు, ఓ నెగిటివ్‌-1 యూనిట్‌, ఏబీ పాజిటివ్‌-3 యూనిట్లు, ఏబీ నెగిటివ్‌-1 యూనిట్‌ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌ బ్యాంక్‌ టెక్నీషియన్‌ యు.లోకేష్‌ను 97036 19706 నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్‌ సమాచారం

అనకాపల్లి: ఇండేన్‌ గ్యాస్‌ ఏజెన్సీ ద్వారా ఆదివారం 228 మంది గ్యాస్‌ బుక్‌ చేసుకున్నారు. గతంలో బుక్‌ చేసుకున్న వారిలో 196 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌ గ్యాస్‌ ఏజెన్సీ ప్రతినిధిని 08924 – 223595 నంబరులో సంప్రదించవచ్చు.

ప్రతి ఇంటికీ సురక్షిత నీరు



తాళ్లపాలెం ప్రధాన రహదారిలో వేసిన పైపులైన్‌



ఇంటింటికి ఇచ్చిన కుళాయి కనెక్షన్లు



కుళాయిలు వేయడానికి సిద్ధంగా ఉంచిన పైపులు

- తాళ్లపాలెంలో సిద్ధమవుతున్న 'జల్‌ జీవన్‌'
- రూ.30 లక్షలతో చురుగ్గా పనులు
- ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు
- త్వరలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు

కోటకోట: తాళ్లపాలెంలో ప్రతీ ఇంటికీ సురక్షిత నీరు అందనుంది. జల్‌ జీవన్‌ మిషన్‌ కింద ఇంటింటి కుళాయిల నుంచి తాగునీటిని అందించడానికి సిద్ధం చేశారు. ఇందుకు రూ.30 లక్షలు మంజూరయ్యాయి. ప్రధాన పైపులైన్‌ ఏర్పాటు చేయడంతో పాటు ఒకవైపు ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. ఇవి త్వరలో ప్రారంభించాలని యోచిస్తున్నారు. దీంతో ఇక తమకు తాగునీటి సమస్య తీరగలదని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో తాళ్లపాలెం రెండో మేజర్‌ పంచాయతీ. సుమారు 5వేల జనాభా కలిగి ఉంది. ఇక్కడ గ్రామం అంతటా బోర్లు, బావుల నుంచి దాదాపు ఉప్పు నీరే లభిస్తోంది. దీంతో తాగునీటికి వీధి కుళాయిలపై ఆధారపడాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ముందుగా తాళ్లపాలెం సంత కాలనీలో రూ.5 లక్షలు వెచ్చించి రెండేళ్ల క్రితం జల్‌ జీవన్‌ మిషన్‌ కింద ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇచ్చి నీటి సరఫరా చేస్తున్నారు. తాళ్లపాలెం ప్రధాన గ్రామంలో ఎక్కువ వ్యయం కావడం వల్ల టెండర్లు పిలిచి రూ.30 లక్షలతో పనులు చేపట్టారు. దీనిలో భాగంగా ప్రధాన రహదారి పొడవునా చెరువు ప్రాంతం నుంచి కూడలి వరకు ప్రధాన పైపులైన్‌ ఏర్పాటు చేశారు.

దాని నుంచి దుర్గాలమ్మ వీధి, తదితర ప్రాంతాల్లోని వీధుల్లో ఇళ్లకు ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. సుమారు 500 వరకు కనెక్షన్లు ఇచ్చారు. రూ.20 లక్షల వరకు ఇందుకు ఖర్చు చేశారు. మరోవైపు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఇందుకు అవసరమైన పైపులు సిద్ధంగా ఉన్నాయి. అయితే ఇప్పటి వరకు ఇచ్చిన కుళాయి కనెక్షన్లకు నీరు సరఫరా చేయాలని భావించారు. ఎన్నికల నేపథ్యంలో నీటి సరఫరా ప్రారంభించలేదు. ఎన్నికల ప్రక్రియ ముగిశాక నీటిని సరఫరా చేయాలని భావిస్తున్నారు. మిగిలిన భాగంలోని ఇళ్లకు కూడా కనెక్షన్లు ఇచ్చి నీటిని అందించాలని యోచిస్తున్నారు. ఇవి పూర్తి అయి, ఇంటింటి కుళాయిల నుంచి నీటి సరఫరా చేపడితే తాగునీటి సమస్య తీరగలదని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే నీటి సరఫరా

తాళ్లపాలెంలో జల్‌జీవన్‌ మిషన్‌ కింద ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇవ్వడానికి రూ.30 లక్షలు మంజూరైంది. దీనిలో భాగంగా ప్రధాన పైపులైన్‌ ఏర్పాటు చేసి ఒకవైపు ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇచ్చి సిద్ధం చేశాం. నీటి సరఫరా చేయాల్సి ఉంది. త్వరలో నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటాం. మిగిలిన భాగంలో పైపులైన్‌ వేసి కుళాయి కనెక్షన్లు ఇస్తాం.

– పావని, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్‌ విభాగం, కోటకోట

ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు



టెన్త్‌, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో సత్యనారాయణ

- దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బహూకరణ

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కృషి చేయాలని చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం విశాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఉప్పు సత్యనారాయణ అన్నారు. ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన 30 మంది విద్యార్థులకు స్థానిక గొల్లవీధి సంఘం కార్యాలయంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారికి సంఘం సీనియర్‌ సభ్యుడు, ముప్పన సిల్క్‌ అధినేత ముప్పన సుబ్రహ్మణ్యం ఆర్థిక సహాయంతో నగదు ప్రోత్సాహకం, మొమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేయడం హర్షణీయమన్నారు. ప్రతీ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సంఘం ఆధ్వర్యంలో సత్కరించడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు వారిలో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో విశాఖ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కాలేపు సదా శివరావు, జిల్లా అధ్యక్షుడు రెడ్డి వరప్రసాద్‌, కార్యదర్శి బూడిద నాగేశ్వరరావు, జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వైఆర్‌కె. చక్రవర్తి, సభ్యులు అల్లాడ పాండురంగ తదితరులు పాల్గొన్నారు.

ఇథలిన్‌ వాయువుతోనే పండ్లు మగ్గబెట్టాలి

- ఉద్యానశాఖ అధికారి రాధిక



పెందుర్తి: మామిడి పండ్లను కాల్షియం కార్బేట్‌ సహాయంతో మగ్గబెట్టడం మంచిది కాదని ఉద్యాన శాఖ అధికారి జి.రాధిక అన్నారు. దీని వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. పక్వానికి వచ్చిన మామిడి కాయలను ఇథలిన్‌ వాయువు సహాయంతో మగ్గబెడితే ఆరోగ్యానికి ఎటువంటి ముప్పు ఉండదని స్పష్టం చేశారు. పక్వానికి వచ్చిన మామిడి కాయలను గాలి చొరబడకుండే ఉండే గదిలో ఉంచి ఇథలిన్‌ వాయువు 2 పీపీహెచ్‌ను స్ప్రే చేసి 16 గంటల తర్వాత తీస్తే రుచికరమైన, ఆరోగ్యకరమైన మామిడి పండ్లు లభిస్తాయన్నారు. లేదా బకెట్‌ నీటిలో ఇథలిన్‌ ద్రావణం, క్లాస్కిక్‌ సోడా కలిపి చల్లిన తర్వాత 24 గంటలు ఉంచాలన్నారు. దీని వల్ల ఇథలిన్‌ వాయువు విడుదలై మామిడి కాయలు మగ్గుతాయని చెప్పారు. ఎట్టిపరిస్థితిలోనూ ప్రభుత్వం నిషేధించిన కాల్షియం కార్బేట్‌ వాడరాదని స్పష్టం చేశారు.

కాలీఫ్లవర్‌ సాగుపై రైతుల ఆసక్తి



ములగపూడిలో సాగు చేస్తున్న కాలీఫ్లవర్‌ పంట

- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం
- ఏజెన్సీకే పరిమితమైన పంట.. మైదాన ప్రాంతంలోనూ సాగు



కాలీఫ్లవర్‌

నాతవరం: ఒకప్పుడు ఏజెన్సీ ప్రాంతాల్లో ఎక్కువగా సాగు చేసే కాలీఫ్లవర్‌ పంట ఇప్పుడు మైదాన ప్రాంతాల్లోనూ రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. ఇతర వ్యవసాయ పంటలతో పోల్చుకుంటే కాలీఫ్లవర్‌ సాగుతో రైతులు అధిక ఆదాయం పొందుతున్నారు.

మండలంలోని ములగపూడి, బెన్నవరం, మాధవనగరం గ్రామాల్లో వ్యవసాయ బోర్ల సాయంతో రైతులు కాలీఫ్లవర్‌ సాగు చేస్తున్నారు. మండలానికి సరిహద్దు గ్రామాలైన నర్సీపట్నం మండలం శివారు ప్రాంతం మెట్టపాలెం, కసిరెడ్డిపాలెం, అప్పన్నపాలెం గ్రామాల్లో కాయగూరల సాగులో కాలీఫ్లవర్‌ కూడా ఒకటి. రెండేళ్లుగా ఇక్కడి రైతులకు ఇది ప్రధాన పంటగా మారింది. ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ బోర్లు ఏర్పాటు చేయడం, 9 గంటల పాటు వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ అందించడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించారు. ఎకరంలో వేసిన కాలీఫ్లవర్‌ పంట ద్వారా మార్కెట్లో గిరాకీని బట్టి ఎడాదికి రూ.లక్ష రాబడి వస్తోందని రైతులు చెప్తున్నారు. సొంతంగా సాగు కష్టం చేసే రైతులకు పెట్టుబడి కేవలం రూ.20 వేలు మాత్రమే అవుతుందని, లేకుంటే మరో రూ.10 వేలు అదనంగా వెచ్చించాలంటున్నారు. ఇతర వ్యవసాయ పంటలతో పోల్చుకుంటే పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ కావడంతో రైతులు వీటి సాగుపై ఎక్కువగా దృష్టిసారిస్తున్నారు. ఈ ఏడాది ఈ గ్రామాల్లో 30 ఎకరాలకు పైగా కాలీఫ్లవర్‌ సాగు జరుగుతోంది.

వేసవి విజ్ఞాన శిబిరాలకు విశేష స్పందన



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు

కోటవురట్ల : గ్రంథాలయ శాఖ నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు మంచి స్పందన లభిస్తోంది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభకు మెరుగులు దిద్దుకుంటున్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్‌ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించగా పలువురు విద్యార్థులు పాల్గొని పుస్తక పఠనం చేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మ్యూజికల్‌ చైర్‌ గేమ్‌ నిర్వహించారు. ఉపాధ్యాయుడు మస్తాన్‌, 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

భగవద్గీత చదివించండి



తోటాడలో కరపత్రాల పంపిణీ

మునగపాక : ప్రతి ఒక్కరూ భగవద్గీతపై అవగాహన పెంచుకోవాలని ఆదినారాయణ స్వామి రాజ యోగాశ్రమం ట్రస్టీ కుమార్‌ కోరారు. మండలంలో గల తోటాడ గ్రామంలో ఆదివారం రాజ యోగాశ్రమం ఆధ్వర్యంలో భగవద్గీతపై అవగాహన కల్పించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కుమార్‌ మాట్లాడుతూ, తల్లిదండ్రులు కూడా పిల్లలను భగవద్గీతపై శిక్షణను పోత్సహించాలన్నారు. తద్వారా పిల్లల్లో మేధాశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌ సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు, ఇంగ్లిష్‌పై పట్టు పెంచుకోవాలి



చినదొడ్డిగల్లులో పుస్తకపఠనంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నక్కపల్లి : తెలుగు, ఇంగ్లిష్‌ భాషలపై విద్యార్థులు పట్టు పెంచుకోవాలని చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వెంకటరమణ, సిహెచ్‌. సతీష్‌ కోరారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులకు స్పోకెన్‌ ఇంగ్లిష్‌పై పలు సూచనలు చేశారు. చిన్న చిన్న పదాలను రాయడం, చదవడం ద్వారా ఇంగ్లిష్‌ సులభంగా నేర్చుకోవచ్చన్నారు. ఇంగ్లిష్‌ భాషపై పరిజ్ఞానం పెంచుకుంటే పోటీ పరీక్షలను ఎదుర్కోవడం ఎంతో సులభమన్నారు. దీన్ని గుర్తించి జగనన్న ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే ఇంగ్లిష్‌ మీడియం ప్రవేశ పెట్టిందన్నారు. విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలుగు భాషలో నేర్చుకోవాల్సిన మెలకువలను ఉపాధ్యాయుడు సతీష్‌ తెలియజేశారు. పద్య పఠనం, పుస్తక పఠనం ద్వారా ఈ రెండు భాషలపై పట్టు సాధించవచ్చన్నారు. వేసవి కాలంలో విద్యార్థుల కోసం గ్రంథాలయంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసిన గ్రంథాలయాధికారి జనార్దన్‌ను వారు అభినందించారు. ఇక్కడ వివిధ రకాల పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలతో పాటు, జనరల్‌ నాలెడ్జ్‌కు సంబంధించిన పుస్తకాలు, ప్రపంచం నలుమూలలా ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు పత్రికలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంగ్లిష్‌ పత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని , గ్రామర్‌పై పట్టు సాధించాలని వారు సూచించారు. ఈ శిబిరానికి వచ్చే విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్‌ పోటీలతో పాటు, చిత్రలేఖనం పోటీలు కూడా నిర్వహించడం జరుగుతోందని జనార్దన్‌ తెలిపారు. ఈ శిబిరానికి ఉపాధ్యాయులు వచ్చిన విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇవ్వడం అభినందనీయమన్నారు.

నేచురోథెరపీతో ఆరోగ్య సంరక్షణ



మాట్లాడుతున్న డాక్టర్‌ బాస్మిలా

చోడవరం రూరల్‌: వ్యాధులు సోకిన తర్వాత మందులు వాడుతూ కలత చెందడం కన్నా వ్యాధులు రాకుండా శరీరాన్ని సంరక్షించుకోవడమే నేచురోథెరపీ విధానమని ఆక్యుపంక్చర్‌ థెరపిస్టు డా.గొట్టివాడ బాస్మిలా తెలిపారు. ఆదివారం స్థానిక వాకర్స్‌ క్లబ్‌ భవనంలో నేచురో థెరపీ, ఆక్యుపంక్చర్‌ వైద్య విధానం పట్ల అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాభ్యసన, ఓంకారం పఠనం, ధ్యానం వంటివి దైనందిన జీవనంలో ఓ భాగంగా మార్చుకోవాలని సూచించారు. రోజూ వీటిని చేయడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చన్నారు. వాకర్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు ఓరుగంటి రాంబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో పూర్వ అధ్యక్షుడు చిరికి దేవానంద్‌, విశ్రాంత ఈవోపీఆర్డీ ఆర్‌.కన్నంనాయుడు, కె.సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు. సుగ్గ అప్పలరాజు, ఎ.శ్రీని వాస్‌లు డాక్టర్‌ బాస్మిలాకు జ్ఞాపికను అందించి, సత్కరించారు.

పైడిమాంబ భారీ ప్రభ



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రభ

కె.కోటపాడు: చౌడువాడ గ్రామ దేవత పెద పైడిమాంబ అమ్మవారి పండగలో భాగంగా ఆదివారం భారీ ప్రభను ఏర్పాటు చేశారు. ఐదేళ్లకోసారి నిర్వహించే అమ్మవారి పెద్ద పండగకు అమ్మవారి వివిధ రూపాలతో కూడిన భారీ ప్రభలు ఏర్పాటు చేయడం ఆనవాయితీ. ఈసారి కూడా దాదాపు 50 అడుగుల ఎత్తైన ప్రభను అమ్మవారి చిత్రాలతో తయారు చేశారు. దీన్ని గ్రామ పెద్దలు, భక్తులు గ్రామంలో నిలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

30 ఏళ్ల నాటి స్నేహబంధం



ఆత్మీయ కలయికలో పూర్వవిద్యార్థుల జోష్‌

యలమంచిలి రూరల్‌ : వారంతా పూర్వ విద్యార్థులు..కాలేజీ రోజుల్లో అనుబంధం..అరమరికలు లేని స్నేహం..30 ఏళ్ల తరువాత మళ్లీ కలుసుకున్న క్షణం..మాటల్లో చెప్పలేని అనుభూతి. ఈ భావోద్వేగ క్షణాలకు ఆదివారం యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదికైంది. 1991–94 బ్యాచ్‌ బిఏ చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఇదే కళాశాలలో కలిశారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఇక్కడకు చేరుకుని సరదాగా గడిపారు. ఎన్నాళ్లైందిరా నిన్ను చూసి..అంటూ ఉత్సాహంగా ఒకరినొకరు పలకరించుకుంటూ సందడి చేశారు. కాలేజీనాటి సంగతులను చెప్పుకుంటూ సరదాగా గడిపారు. అప్పట్లో తమకు పాఠాలు బోధించిన అధ్యాపకులను, వారి వద్ద నేర్చుకున్న జీవిత సత్యాలు తమ ఎదుగుదలకు ఎలా ఉపయోగపడ్డాయో అందరూ తమ అనుభవాలను పంచుకున్నారు. అందరూ కలిసి భోజనం చేశారు. కొక్కిరాపల్లి పీఏసీఎస్‌ పాలకవర్గ అధ్యక్షుడు మళ్ల కొండబాబు, ఆరిపాక శీను, థామస్‌ విద్యాధర్‌, అవధూతల చంద్రశేఖర్‌, వెంకట్రావు, జోగా శ్రీను,అప్పలనాయుడు, అరుణకుమారి, సుజాత పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలకు ఎంపిక



ఆదిత్య గౌతమ్‌



మధుశ్వేతశ్రీ

కోటవురట్ల: లక్ష్యం ఉంటే అనుకున్నది సాధించవచ్చని పలువురు చిన్నారులు నిరూపించారు. చిన్నతనం నుంచి విద్య పట్ల శ్రద్ధ ఉంటే భవిష్యత్‌కు బంగారు బాట వేసుకున్నట్టే. రాజుపేటలోని స్టార్‌ విద్యానికేతన్‌లో చదివిన మాకవరపాలేనికి చెందిన ఆరుగురు విద్యార్థులు ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదివేందుకు అర్హత సాధించారు. ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్షలో సత్తా చాటి నర్సీపట్నం, భీమిలి, తానాంలో ఉన్న ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లోకి ప్రవేశాలు పొందారు. కొమ్మోజు ఆదిత్య గౌతమ్‌, కొమ్మోజు కైవల్య, కన్నూరి యశ్వంత్‌, రాపేటి మధుశ్వేతశ్రీ, కన్నూరి వంశీ, సూరిశెట్టి భానుతేజ ఎంపిక కాగా వీరికి 5వ తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వమే ఉచితంగా విద్యను అందించనుంది. వసతి, భోజన సదుపాయంతో పాటు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందిస్తారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్‌ రుత్తల భవానీ, హెచ్‌ఎం భీశెట్టి శ్రీను, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

యోగాతో ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

రాంబిల్లి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని దిమిలి లైబ్రేరియన్‌ ఎస్‌.శకుంతల అన్నారు. ఇక్కడి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణలో భాగంగా ఆదివారం యోగాపై శిక్షణ ఇచ్చారు. వేసవి శిబిరంలో యోగాతో పాటు నీతి కథలు చదవడం, పలు రకాల ఆటలపై తర్ఫీదు నిస్తున్నామని శకుంతల తెలిపారు. పలువురు రిసోర్స్‌ పర్సన్‌ సహకారం తీసుకుంటున్నామన్నారు.

మోదకొండమ్మ ఘటాల దర్శనానికి బారులు తీరిన భక్తులు



మోదకొండమ్మ ప్రతి రూపమైన ఘటాలను దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ నెల రోజుల పండగ సందర్భంగా అమ్మవారు కొలువైన సతకంపట్టు వద్ద ఆదివారం అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో సతకంపట్టు వద్ద పండగ వాతావరణం నెలకొంది. ఆలయ కమిటీ భక్తులకు తాగునీరు తదితర ఏర్పాట్లు చేశారు.

మోదమాంబ మాలధారణ



వీరవల్లి అగ్రహారంలో మోదమాంబ మాలధారణలో పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్‌: మండలంలోని వీరవల్లి అగ్రహారం అమ్మవారి పీఠం వద్ద ఆదివారం 10 మంది భక్తులు మోదమాంబ మాలధారణ చేశారు. గురుమాత పాలకుర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వాకపల్లి, సమీప గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారి మాలను ధరించారు. వచ్చే నెల 17 వరకు మాలాధారణలో రోజూ ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు భక్తులు తెలిపారు.